

కథా కౌముది

# ఓ..నందికేశ్వరా_ _ _!

చివుకుల పద్మజ

మెల్బోర్న్, ఆస్ట్రేలియా.. సాయంకాలం 6 గంటలు.

ఆఫీస్ లో పని ముగించుకుని, లాప్ టాప్ సర్దుకుని, "బై మిస్టర్ స్టీఫెన్" అని నా కొలీగ్ తో చెప్పి బయలుదేరబోతున్నాను.

ఇంతలో నా ఫోన్ కువకువ లాడింది. వాట్సాప్ మెసేజ్ నాన్న నుంచి, ఫ్రీ గా ఉంటే ఫోన్ చెయ్యమని.

"హాయ్ నాన్నా.. చెప్పండి" అన్నాను ఫోన్ చేసి.

"దివ్య పెళ్లి సాయంత్రం లైవ్ ఇస్తున్నారు. తప్పకుండా చూడమని చెప్పింది రా అమ్మ" పెళ్లి హడావిడి స్పష్టంగా తెలుస్తోంది పక్క నుంచి.

దివ్య నా మేనత్త కూతురు. నా కన్నా సంవత్సరం పెద్దది. మా మధ్య బంధుత్వం కన్నా స్నేహం ఎక్కువ.

"అమ్మ ఏం చేస్తోంది నాన్నా?" అడిగాను పార్కింగ్ లోకి నడుస్తూ.

"భోజనాల వద్దన లో వుంది రా. పేరుకు నేను మేనమామనే కానీ హడావిడి అంతా మీ అమ్మదే. నువ్వు మీ అమ్మ ఒకటేగా, సందడి చెయ్యటం లో" మురిపెం తో కూడిన నిష్టూరం నాన్న గొంతులో.

నిజమే, నాకు అమ్మ పోలికే వచ్చింది. ఏ ఫంక్షన్ అయినా నేను మా అమ్మ చేసే సందడి ఇంతా అంతా ఉండదు. ఆడుతూ పాడుతూ ఆ పనులన్నీ చేసేస్తాం.

"సరే నాన్నా. రాత్రికి పెళ్లి చూసి రేపు మాట్లాడతా. బై మరి" ఫోన్ పెట్టేసి కార్ స్టార్ట్ చేశాను.

★★★

ఆఫీస్ ప్రాజెక్ట్ మీద ఆస్ట్రేలియా వచ్చాను 10 నెల్ల క్రితం. వర్క్ చివర్లో ఉందని లీవ్ ఇవ్వలేదు. పెళ్ళికి వెళ్ళటానికి వీలులేక పోయింది.

చ.. ఛండా మిస్ అవుతున్నా.. మరోసారి వాపోతూ ఇంటి దారి పట్టా. మాస్టర్స్ ఇన్ బిజినెస్ చేస్తున్న ఇద్దరు పంజాబీ స్టూడెంట్స్ తో షేరింగ్ అకామడేషన్ ఇచ్చారు ఆఫీస్ తరపున. వాళ్ళూ చాల ఫ్రెండ్లీగా వుంటారు. చకచకా ఫ్రెష్ అప్ అయి కొంచెం మిగిలిపోయిన ఆఫీస్ వర్క్ చేసేసరికి నా రూమ్మేట్స్ వచ్చేసారు. ముగ్గురం కలిసి రోటి లు చేసుకుని బాతాఖానీ వేస్తూ డిన్నర్ ముగించాము.

ఇండియా కన్నా 4:30 గంటలు ముందు ఉంటుంది టైం ఇక్కడ. పెళ్లి ముహూర్తం 8 గంటలకి అంటే ఇక్కడ 12:30 కి. అరగంట ముందే లైవ్ స్టార్ట్ చేసారు. ఇంక పెళ్లి లోకి దూకి పోయా.

పెళ్లి మంటపం కనిపిస్తోంది. పెళ్ళికొడుకు పూజ చేస్తున్నాడు... దివ్యని బుట్టలో తెస్తున్నారు.. అరుగో, నాన్న బుట్ట మోస్తున్నారు మేనమామ కనుక. పర్లేదులే. బక్క పక్షి.. ఈజీ గానే మొయ్యచ్చు.

పెళ్లి తంతు వరసగా జరుగుతోంది.. జీలకర్ర–బెల్లం, మంగళ సూత్రం.. తలంబ్రాలు .. అమ్మ దివ్య వెనకే కూర్చుని చేసే హడావిడి చెప్పలేకపోతున్నా. చాల హుషారు గా జరుగుతోంది తలంబ్రాల కార్యక్రమం. తలంబ్రాలు పూర్తి కాగానే సడన్ గా ఒక్కసారిగా అమ్మ, దివ్య లైవ్ కెమెరా వైపు చూసి.."మిస్ యూ అభీ.." అని అరిచారు.

చెప్పలేని సంతోషం వేసింది.. అక్కడ లేనందుకు బాధ, ఇక్కడ వున్నా పెళ్లి చూడగలిగినందుకు తృప్తి .. ఇలా రకరకాల ఎమోషన్స్ లో ఉండగానే లైవ్ ముగిసింది. నాన్నకి, దివ్య కి మెసేజ్ పెట్టి, రేపు శనివారమేగా, తీరిగ్గా మాట్లాడదాం లెమ్మని చిన్నగా పక్క చేరా.

★★★

"నీ కాళ్ళను పట్టుకు వదలనన్నవి చూడే నా కనులు..ఆ చూపులనెల్ల తొక్కుకు వెళ్ళకు దయలేదా అసలు..."... అదే పనిగా ఫోన్ మోగటం ఎక్కడో లీల గా వినిపిస్తోంది. గబుక్కున లేచి చూసా. మా అమ్మమ్మ కాల్ అది.

మా అమ్మకు పిన్ని. మా స్వంత అమ్మమ్మ మా అమ్మ చిన్నతనం లోనే పోతే తనే మా అమ్మను పెంచింది. తన కొడుకు కోడలు ఇక్కడే ఉద్యోగాలు చేస్తున్నారు. అమ్మమ్మ ఇండియాకు ఆస్ట్రేలియాకు మధ్య తిరుగుతూ ఉంటుంది. పేరుకు నేనుండే ఫ్లాట్ ఇదే కానీ తీరిక సమయాలని వాళ్లింట్లోనే గడుపుతుంటా.

"చెప్పు అమ్మమ్మా.." అన్నాను

"అభీ.. ఏంట్రా ఫోన్ తీయవు. చాల సేపటినుంచి చేస్తున్నా" ఆత్రం గా అడుగుతోంది.

“రాత్రి లేట్ గా పడుకున్నా అమ్మమ్మా దివ్య పెళ్లి చూసి, అందుకే లేవలేకపోయా" నిద్రమత్తు లోనే సమాధానం ఇచ్చాను.

"సర్లే. లేచి కాస్త తెప్పరిల్లి ఫోన్ చెయ్యి. అర్జెంటు పని వుంది నీతో" అని పెట్టేసింది.

ఏంటబ్బా అంత అర్జెంటు అని నిద్ర మత్తు వదుల్చుకుని ఫోన్ చేశాను.

"ఎం లేదురా. కోడలి చేత వచ్చే ఆదివారం నందికేశ్వరుని నోము నోయిస్తున్నా. కావలసినవన్నీ ఈ వారమే తేవాలి. కాస్త నన్ను ఆ ఇండియన్ మార్కెట్స్ కి గానీ తీసుకువెళ్లావా అంటే.. నీకు మంచి పెళ్ళాం వస్తుంది రా"

"ఇంత మాత్రానికే అంత హడావిడిగా ఆవిడ రావటం ఎందుకులే అమ్మమ్మా.. రెడీ గా వుండు, ఒక గంట లో వస్తా" కాస్త కొంటెతనం చోటు చేసుకుంది నా మాటల్లో.

అయితే ఈ శని, ఆది వారాలు షాపింగ్ లో గడుస్తాయి అనుకుంటూ అమ్మమ్మ ని పిక్ చేసుకున్నా. ఇంకా ఆ రెండు రోజులు మెల్బోర్న్ విధులన్నీ చుట్టేసాం, అమ్మమ్మ షాపింగ్ లో, నేను ఫోన్ లో పెళ్లి కబుర్లు ఫాలో చేస్తూ.

"మా నాయనే. చెప్పిన మాట విన్నావు. నా కొడుకూ వున్నాడు ఎందుకు".

"అమ్మమ్మా. నా కొడుకు అని తిడుతున్నావా నువ్వు?" .. మళ్ళీ టీజింగ్ ఇంతలో.

"అబ్బ. అదే లేరా .. మీ మావయ్య. పనుందని తప్పించుకున్నాడు. ఇహ కోడలేమో వచ్చే వారం ఎలాగూ నోముతో సరిపోతుంది. ఈ వారమన్నా రెస్ట్ తీసుకోకపోతే వారం అంతా పని చేయలేను అని సన్నాయి నొక్కింది రా"

"అంతేగా.. ఉద్యోగాలన్నాక తప్పదుగా" అన్నా.

"ఏమి తప్పదు రా. ఎన్నేళ్ల నుంచి ఇండియా వచ్చినప్పుడు నోము నోయిస్తా అంటే విన్నదా.. ఎప్పుడూ ఏదో ఒక సాకు. ఇహ లాభం లేదని నేనే మన వాళ్ళని పిల్చి పెడుతున్నా్నా ఈ కార్యక్రమం" అన్నది అతిశయంగా.

తనే మళ్ళీ " మీ అమ్మ బంగారు తల్లి రా. చెప్పిన మాట విన్నది. నీ చిన్నతనం లో నే దాని చేత తీర్పించేశా. ఇదే కాదు, చాలా చేయించా" అంది.

సరేలే, అసలే పెళ్లి సందడి తప్పి పోయింది, ఇదన్నా ఎంజాయ్ చేద్దాం అనుకుని సంబరపడ్డాను రాబోయే ఉపద్రవం తెలీక.

★★★

అనుకున్న ఆదివారం రానే వచ్చింది. అమ్మమ్మ వాళ్ళు వంటింటి పనుల్లో ఉంటే, నేను డెకరేషన్, మిగిలిన అరేంజ్మెంట్స్ చేశాను. ఇందులో నాకు హెల్పర్ మా మామయ్య కొడుకు ఏడేళ్ల వినీత్.

ఉదయం 6 కల్లా పూజ మొదలు పెట్టేసారు. 8 కల్లా రావాల్సిన వాళ్లు అందరు వచ్చేసారు బంధు మిత్ర సపరివార సమేతంగా.

"అందరూ కూర్చోండమ్మా. పూజ చివర్లో వుంది, కాంగానే టిఫిన్స్ చేద్దాం " అంది అమ్మమ్మ అందరిని సంబరంగా పలకరిస్తూ.

నైవేద్యం అవటం ఆలస్యం, ప్లేట్స్ తీసుకు వెళ్ళా వంటింట్లోకి. చాలా గిన్నెలున్నాయి. మూతలు తీసి చూస్తే అన్నిట్లో ఉండ్రాళ్ళు.. "ఆ.." అనుకుంటూ ఇంకా తీస్తే అల్లపచ్చడి, పల్లి పచ్చడీ ను.

"ఇంకేం లేవా అమ్మమ్మా, ఇదొక్కటేనా?"

"అదే కాదురా.. ఇవిగో శనగలు. పచ్చివి తినలేరని గుగ్గిళ్ళు చేశా.. ఇవి కూడా చేర్చు ప్లేట్స్ లో" పెద్ద టిఫిన్ నిండా అందించింది.

"మరీ ఇన్నెందుకు.. కాస్త తగ్గించి మంచి వేరే వెరైటీస్ చెయ్యచ్చుగా" అన్నాను.

"ఇవి ఇన్నేసి అని లెక్క ఉంటాయి రా. అంతే చెయ్యాలి" అని ఏదో నాకర్థం కానీ శేరు, మానిక భాషల్లో చెప్పింది.

సరేలే ఇంక, టిఫిన్ కేగా, భోజనాల్లో మంచివి చేస్తుందిలే అమ్మమ్మ... అనుకుంటూ అందరికి అందించే పని లో పడ్డాను. యధాప్రకారం, నా హెల్పర్ వినీత్, మరికొంత మంది వచ్చిన వాళ్లలోని లేడీసును.

టిఫిన్స్ కానిచ్చాక మంచి అల్లం టీ అందించింది మా మామయ్య భార్య, నాకు అత్తయ్య, సదరు నోము తిర్చుకుంటున్న వనితామణి.

మళ్ళీ మధ్యాహ్న భోజనాల తయారీ సాగుతోంది వంటింట్లో... ఆడవాళ్లు అక్కడ.. మగవాళ్ళం ఇక్కడ . తరతరాలుగా మా జాతికి మణిమకుటమైన పేకాటలో.. మహా క్రీడాస్ఫూర్తితో.

"అభీ..వినీత్.. రండర్రా. భోజన ఏర్పాట్లు చూడండి" 2 గంటల కల్లా అమ్మమ్మ పిలుపు.

ప్లేట్స్ పెట్టి, ఆధరువు లన్నీ వడ్డించి, అన్నం పళ్లెం కేసి చూస్తే ఏముంది, పొద్దుటి ఉండ్రాళ్ళు మళ్ళీ దర్శనమిచ్చాయి.

"అమ్మమ్మా. ఏంటివి? అన్నం కావాలి" అన్నా.

"ముందివి కానివ్వండి. అయిపోయాక మిగిలింది అన్నం వడ్డించచ్చు. ఉదయం అందరు నాజూకు తిళ్ళు తింటిరి. ఇవ్వేమో సాయంకాలానికి మిగలకూడదు. లేకపోతే వ్రతభంగం" చిన్నగా చెప్పింది.

"ఇవెలా తినాలి?" ఇంకా అయోమయం గానే వుంది.

"నీకన్ని వివరించాలి. పొడి చేసుకుని అన్నీ అందులో కలుపుకు తింటారు. పెట్టరా ముందు" గద్దించింది.

ఆల్రెడీ ఈ కాన్సెప్ట్ తెలుసేమో, పెద్దవాళ్ళనుండి ఏమి రియాక్షన్ రాలేదు. నా వయసు వాళ్లకు, పిల్లలకు మాత్రం నిలువుగుడ్లు పడ్డాయ్.

ఇక చూడండి. ఈ ప్రహసనం అలా అలా సాగింది. మాట్లాడితే ఉండ్రాళ్ళు, శనగలు ప్రత్యక్షం. ఎవరిని కదిలించినా వద్దొద్దని సాగిలపడే వాళ్ళే. నా చేత యధాశక్తి.. కాదు .. కాదు.. శక్తి కి మించి పూర్తిగా ఐపోయేదాకా తినిపించింది అమ్మమ్మ.

ఫ్లాట్ దగ్గరేగా. రాత్రి కి వెళ్ళిపోతా అని బతిమలాడి వచ్చేసాను. రాత్రంతా ఒకటే శనగల తేనుపులు. పొట్ట నిండా ఘటం వాయించచ్చు అనేంత గ్యాస్. తెలవారుతుండే సరికి టాయిలెట్ కి ప్రదక్షిణాలు మొదలు పెట్టా. ఆఫీస్ లేదు, పాడు లేదు. సాయంత్రం దాక అదే పని. ఈ దెబ్బ నన్ను 2 రోజులు ఆఫీస్ కి వెళ్లనివ్వలేదు. ఓ, నందికేశ్వరా! ఎంత పని చేశావయ్యా.. ఒక లక్ష సార్లు అనుకుని వుంటాను.

★★★

చిన్నగా కోలుకుని నా రొటీన్ లో పడిపోయాను. మా ప్రాజెక్ట్ దాదాపు అయిపోవచ్చింది.

ఆ సాయంత్రం మాములుగా అమ్మమ్మ దగ్గరికి వెళ్ళాను. చాల రోజులైంది ఈ మధ్య ఇక్కడికి వచ్చి, రోజూ పనెక్కువ ఉండటంతో ఎప్పట్లా కుదర్లేదు. నన్ను చూసి సంబర పడింది. మామూలు కబుర్లు అన్ని అయ్యాక,

"అభీ" గారం గా పిల్చింది.

"ఏంటి అమ్మమ్మా?"

"ఏం లేదురా, మొన్న అత్తయ్య చేత నోము పట్టించా కదా.. మళ్ళీ చేయాలిరా"

"ఇంకానా?" అదిరి పడ్డాను.

"అవును. మొన్న రెండేగా చేసింది. ఇంకా 7 వంటలు చేయాలిరా."

"ఏం చెయ్యాలి" నీరసంగా అడిగాను.

"ఆ.. పెద్దగా ఏం లేవు లే. పెసర గారెలు, చలిమిడి, పాయసం, చక్ర పొంగలినీ" కులాసాగా రివాల్వింగ్ చైర్లో ఊగుతోంది.

నా గుండెల్లో పెద్ద అగ్నిపర్వతం పేలింది. అమ్మో, మొన్న రెండిటికే నా పరిస్థితి అలాఅయింది. పెసలు, చలిమిళ్ళు తింటే నా గతేమి గాను దేశం కానీ దేశం లో. ఎట్లా తప్పించుకోవాలి ఈ ప్రమాదం. రకరకాలైన ఆలోచనలు.

దభాలున నా మనుసు కొక మహత్తరమైన ఆలోచన తట్టింది.

"ఒక 20 రోజుల్లోపు నేను వెళ్ళిపోతాను. ఎలాగు 2 నెలల్లో వినీత్ కి సెలవులు. వాళ్ళను తీసుకుని ఇండియా వచ్చేయండి. అక్కడ చేసుకోవచ్చు. చాలా మంది వుంటారు, అన్ని మిగిలిన వంటలు ఒక్కసారే చేయవచ్చు. అత్తయ్యని ఒప్పించే పూచి నాది." ఏమంటుందా అని టెన్షన్ గా చూస్తున్నా.

"అట్లా అంటావా" ఆలోచనలో పడ్డది.

అమ్మో ఇంకా ఆలస్యం చెయ్యకూడదు అని,

"అవును అమ్మమ్మా. ఇప్పుడు దివ్య వైపు బంధు బలగం కూడా చేరిందిగా. ఇంకా ఆలోచించకు. ఫిక్స్ అయిపో" నమ్మకంగా చెప్పా.

"సరే , నువ్వు ఇంత బాధ్యత తీసుకుంటానంటే నాదేముంది" అంది చిన్నగా.

అమ్మయ్య.. దివ్య ని ఇరికిస్తా.. లేకపోతే . . "ఎలాగూ 2 మంత్స్ లో వచ్చేస్తా కదా, అప్పుడు పెట్టుకోవే పెళ్లి" అంటే "కుదరదు అభీ.. వసంత్ ఏమంటారో" అని నీలుగుతుందా? చిన్నపటినుంచి కలిసి తిరిగాం, నేను లేకుండా తయ్యిమని పెళ్ళికి కూర్చుంటుందా.. వుండు.. దివ్యా,.. నిన్ను నందికేశ్వర నోముకి పిలిపించి, కొత్త పెళ్లికూతురు వని, నీకిస్తే మరీ మరీ మంచిదని చెప్పి, నీ చేత హీనపక్షం ఐదు పిండి వంటలన్నా తినిపించి నిన్నేడిపించక పోతే, నా పేరు అభీ నే కాదు.

ఆహా.. ఆలోచనే ఎంతో బాగుంది. ఇంక ఈ ఆనందంలో అమ్మమ్మ మాట్లాడుతున్న మాటలు వినిపించడమే మానేశాయి.

★★★

COMMENTS